మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా




స్వయం సహాయ సంఘాల మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సభకు హాజరైన మహిళలు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా పేర్కొన్నారు. సోమవారం ఎర్రముక్కపల్లె గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో కడప నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ.. ఈ నాలుగేళ్లలో కడప నగరంలోని లబ్ధిదారులకు సుమారు రూ.100 కోట్లను జగనన్న వైఎస్సార్ ఆసరా పథకం కింద అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదని, ఇది చేతల ప్రభుత్వం అని, మ్యానిఫెస్టో అంటే అంకెల గారడీ కాదని అది ఒక పవిత్రమైన భగవద్గీత, బైబిల్ మరియు ఖురాన్‌లా భావించడం జరుగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని, రుణాలు కట్టొద్దని పిలుపునిచ్చి తరువాత మోసం చేశారని ధ్వజమెత్తారు. మహిళల ఆర్థిక ఇబ్బందులను ఎన్నికల ముందు పాదయాత్రలో కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆ నాడు మాట ఇచ్చారని.. ఈ మేరకు అధికారంలోకి వచ్చాక విడతల వారీగా డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి.. ఇప్పుడున్న వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న తేడా గమనించాలన్నారు. అమ్మ కడుపులోని బిడ్డ నుండి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ వరకు ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి తగు పథకాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, కాపు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ళ పట్టాలు ఇలా అనేక పథకాలు అమలు చేశారన్నారు. పదవులలో కూడా 50 శాతం మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, మహిళల రక్షణ కొరకు దిశబిల్లు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు కె. బాబు, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, శ్రీరంజన్‌రెడ్డి, ఐస్‌క్రీం రవి, రామచంద్రయ్య, లక్ష్మయ్య, తోటక్రిష్ణ, లక్ష్మీనారాయణ, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం..
ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్వయం సహాయ సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో పూర్తి రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు.

క్లుప్తంగా

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం సీఎస్ఐ హైస్కూలు పూర్వ విద్యార్థులు సోమవారం పేదలకు అన్నదానం చేశారు. 1978వ బ్యాచ్ పూర్వ విద్యార్థి సుబాన్‌బాష మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థులతో కలిసి రెండవసారి అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మనోహర్, స్టీఫెన్, విజయ్ కుమార్, నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు అమృతానగర్‌లో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ 15 ఏళ్ల కిందట పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రభుత్వం అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కొందరు అధికారులు డబ్బులు తీసుకుని బేస్ మట్టాలను ఇతరులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్యనారాయణచారి, శివకుమార్, మనోహర్, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకంలో దేవుని ప్రేమ గొప్పది



ప్రసంగిస్తున్న క్రైస్తవ ప్రముఖులు ప్రకాశ్

కడప కల్చరల్ : లోకంలో దేవుని ప్రేమే ఎంతో గొప్పదని క్రైస్తవ ప్రముఖులు దాసరి ప్రసాద్, ప్రకాశ్ అన్నారు. సోమవారం స్థానిక మాసాపేటలో పాస్టర్ దాసరి సుధాకర్, సువర్ణ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలీము ప్రార్థనా మందిరాన్ని వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆధ్యాత్మిక కూడికలో వారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు మల్లెకొండు సంపత్‌కుమార్, పాస్టర్లు క్రిస్టఫర్, జలతోటి కరుణాకర్, ఉప్పుల విజయకుమార్, పాస్టర్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ రాష్ట్ర మాలమహానాడు రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. మాలమహానాడు నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్, రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరి సురేష్, జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు పందీటి శ్రీనివాసులు, నగర మహిళ అధ్యక్షురాలు శిరీష, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కేపీ ఉల్లి కొనుగోలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : మైదుకూరు నియోజకవర్గంలో రైతులు పండిస్తున్న కేపీ ఉల్లిని క్వింటాలు రూ. 10 వేలతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్‌లు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. మైదుకూరు, దువ్వూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లో ఎక్కువ మంది రైతులు ఈ పంట పండిస్తున్నారన్నారు. ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారని తెలిపారు. అయితే గిట్టుబాటు ధర లేక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈనెల మొదటి వారంలో క్వింటాలు రూ.6 వేలు ఉన్న ధర అమాంతం రూ. 2 వేలకు పడిపోవడంలో దళారుల పాత్ర ఉందని ఆరోపించారు. అందుకే ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

ఘన నివాళి



బాల వెంకట రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బంగారు గంగాదేవి, డైరెక్టర్లు

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్‌యార్డు కార్యదర్శిగా బాల వెంకటరెడ్డి అందించిన సేవలు మరువలేనివని కడప మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి పేర్కొన్నారు. బాలవెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.

సోమవారం కడప మార్కెట్ యార్డులో ఆయన సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు గంగాదేవి మార్కెట్ యార్డు డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి బాలవెంకట రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల వెంకటరెడ్డి నిబద్ధత, నిజాయితీ గల అధికారిగా మార్కెట్ యార్డు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్లు వల్లెకొండు సంపత్, కృష్ణారెడ్డి, జయశ్రీ, మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజల అర్జీలను పరిశీలించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఐఏఎస్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మొత్తం 62 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అర్జీలు 29 వచ్చాయి. అలాగే టౌన్ ప్లానింగ్-13, రెవెన్యూ- 8,హెల్త్ విభాగం-2, యూపీఏ విభాగం-2, తాసిల్దార్ కడప-1, సచివాలయ విభాగం-2, హౌసింగ్ విభాగం-5 వచ్చాయి. ఈ అర్జీలన్నీ కూడా శాఖాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరణ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

■ మార్నింగ్ విజిట్‌లోభాగంగా కమిషనర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ఉక్కాయపల్లె ప్రాంతాలను పరిశీలించారు. పుట్లంపల్లి, ఉక్కాయపల్లె, వినాయకనగర్ వద్ద నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరణకు గడువు పెంచాలి

కడప కార్పొరేషన్ : ఇటీవల నూతనంగా ప్రారంభించిన కేన్సర్, మానసిక వైద్యశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు స్వీకరణ గడువును పెంచాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరెడ్డి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాయల్ కోరారు. సోమవారం వారు రిమ్స్ డైరెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఉద్యోగ నోటిఫికేషన్ లో సమయం చాలా తక్కువ ఇవ్వడం, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు ఖచ్చితంగా సమర్పించాల్సి ఉన్నందున ఇచ్చిన గడువు ఏమాత్రం సరిపోదన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ రావాలన్నా మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణకు గడువును పదిరోజులు పెంచాలని కోరారు. దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గడువు పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ ఉపాధ్యక్షుడు నరసింహ పాల్గొన్నారు.

సుంకర.. స్థాయి తెలుసుకుని మాట్లాడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్ తదితరులు

కడప కార్పొరేషన్ : ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషాను విమర్శించే స్థాయి జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్‌కు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, కో ఆప్షన్ సభ్యురాలు పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సామాన్య కార్యకర్త నుంచి కార్పొరేటర్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన అంజద్‌బాషాకు గత ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చిందనే విషయాన్ని సుంకర గమనించాలని హితవు పలికారు. రెండు చోట్లా పోటీ చేసి ఓడిపోయిన పవన్ కళ్యాణ్ గూర్చి రెండు సార్లు గెలిచి, డిప్యూటీ సీఎంగా ఉన్న అంజద్‌బాషాకు మాట్లాడే అర్హత లేదనడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో కె. చంద్ర, ఎస్. సుబ్బయ్య పాల్గొన్నారు.

7 నుంచి విష్ణు సహస్ర నామ జప యజ్ఞం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో 24వ వార్షికోత్సవ సందర్భంగా పలు ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దేశు వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 7 నుంచి 10వ తేది వరకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. 7వ తేది సాయంత్రం 4.30 గంటలకు అయోధ్యలో కరసేవ చేసిన వారికి సత్కారం ఉంటుందని, 8వ తేది సాయంత్రం 6.30 గంటలకు ఆలయ బృందంచే కోలాటం ప్రదర్శన ఉంటాయన్నారు. 9వ తేది సాయంత్రం 6.30 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. చివరిరోజు 10వ తేదిన ఉదయం 5.30 గంటలనుంచి నగర సంకీర్తన, 6.30 గంటలకు పూజాధికాలు, 8.00 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ కోటి జప యజ్ఞం నిర్వహిస్తామన్నారు.

వాహన డ్రైవర్లకు కంటి చూపు ఎంతో ముఖ్యం



డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాహన డ్రైవర్లకు కంటి చూపు ఎంతో ముఖ్యమని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్, జిల్లా ఆటవీ శాఖాధికారి పివి సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు వారి కుటుంబ సభ్యులకు, ఇతర ప్రజానీకానికి పుష్పగిరి ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని , ఏమాత్రం ఒంట్లో నలతగా ఉన్నా డ్రైవింగ్ చేయరాదన్నారు. వేగాన్ని అదుపులో ఉంచుకున్నట్లయితే ప్రమాదాన్ని నివారించవచ్చని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తేజ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేయాలని జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత తెలిపారు. సోమవారం కడప నగరంలోని కొండాయపల్లెలో ఉన్న మోడల్ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులోనే బాల్య వివాహాలు చేస్తే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఆడపిల్లను చదువుకునేలా ప్రోత్సహించి సరైన వయస్సులో వివాహం చేయాలని సూచించారు. చెడు, మంచి స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. శిశు గృహ మేనేజర్ కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమం గురించి వివరించారు. చట్టబద్ధమైన దత్తతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ ప్రతిరూప్, సూపర్‌వైజర్ మాబుచాన్‌లు మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఎదుగుదల జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వయోవృద్ధులను సంరక్షించాలి

కడప అర్బన్ : తల్లిదండ్రులు, వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సోమవారం చౌడమ్మ ఓల్డ్ ఏజ్ హోంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పి. మనోహర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల వేధింపులు తగవు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖపట్టణం డీపీటీఓ ఉద్యోగుల పట్ల వేధింపులకు పాల్పడటం తగదని ఏపీఎస్ ఆర్టీసీ ఎన్ఎంయూఏ రీజినల్ సంయుక్త కార్యదర్శి దాస్, డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కడప ఆర్టీసీ బస్టాండులో ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డీపీటీఓ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టేలా చర్యలకు పాల్పడుతుండడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ అధ్యక్షులు జయరాం, అసిస్టెంట్ సెక్రటరీలు సుబ్బారావు, నాగరాజు, సునంద, అమరేశ్వరి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

కడప అర్బన్ : కడప నగరంలోని పాత కడపలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మేరీ అనే మహిళ ఇంటిలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే కడప ఫైర్ స్టేషన్ అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 80వేల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలియజేశారు.

ఏఐటీయూసీ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. స్వీపర్లకు పారిశుద్ధ్య కార్మికుల వేతనం వర్తింపజేయాలన్నారు. కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం జేసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, హుసేనీ, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, స్వీపర్ల యూనియన్ నాయకులు కుమారి, షాకీర, నాగలక్ష్మి, వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసి, సేవ్ ఎడ్యుకేషన్, సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫిబ్రవరి 1వ తేదీ నిర్వహించే చైన్నై ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను, ర్యాలీ పోస్టర్లను సోమవారం కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎఫ్ నాయకులు భాస్కర్, పీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అర్జునరావును తక్షణమే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గోడౌన్లలో వేల క్వింటాళ్ల బియ్యం గోల్‌మాల్‌కు అర్జునరావు పాల్పడ్డారని ఆరోపించారు. ఉద్యోగుల టీఏ, డీఏ బిల్లులకు, హమాలీల పీఎఫ్ నిధుల విడుదలకు డీఎం కక్కుర్తి పడుతున్నారని చెప్పారు. తక్షణమే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ అధికారులతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి, వేణుగోపాల్, బాదుల్లా, విజయలక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ ఉప కార్యదర్శి హృదయరాజు కోరారు. ఈ మేరకు సోమవారం కడప కలెక్టరేట్ వద్ద పెన్షనర్లు నల్లబాడ్జీలతో ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన పెన్షనర్లకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తగ్గించిన క్వాంటమ్ పెన్షన్‌ను పెంచాలని కోరారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధకృష్ణ, ఎన్‌జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్, ఎస్టీయూ సంఘ నాయకులు ఇలియాస్‌బాష, రమణారెడ్డి, సంగమేశ్వరరెడ్డి మాట్లాడారు. అనంతరం వారు డీఆర్‌ఓలో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదిత్య కళ్యాణమండపం సమీపంలో మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా ఎస్ఐ పి. రవికుమార్ తమ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.3600 విలువైన 30 క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

3న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షల విభాగంలో పనిచేసేందుకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీతో పాటు ఎంఎస్ ఆఫీస్‌లో అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీన కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ధృవీకరణపత్రాలు, రెజ్యూమ్‌తో హాజరుకావాలని కోరారు.

విద్యార్థి సంఘాల నిరసన

వైవీయూ : బీఈడీ కౌన్సెలింగ్ ప్రారంభం కాకముందే ప్రైవేట్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయంటూ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల వద్ద పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, నగర కార్యదర్శి గణేష్, డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు షాకీర్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆచార్య వాసంతి రాజేంద్రన్

వైవీయూ : ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న యువతకు సైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తమిళనాడు పెరంబదూర్ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ (ఆర్‌జీఎన్ఐవైడీ) కెపాసిటీ బిల్డింగ్ విభాగాధిపతి ఆచార్య వాసంతి రాజేంద్రన్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్, భారత యువజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీపై యువతకు అవగాహన' కల్పించే దిశగా మాస్టర్ ట్రైనర్లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాజాన్ని సైబర్‌క్రైమ్ నుంచి రక్షించేదిశగా కృషి జరగాలన్నారు. ప్రధానంగా యువత డిజిటల్ పరికరాలను ఉపయోగిస్తూ, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం వెచ్చిస్తున్నందు వల్ల సైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన అవసరమన్నారు. ఆర్‌జీఎన్ఐవైడీ ప్రోగ్రామర్ అండ్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ ఎస్. బాలకృష్ణన్ సైబర్ సెక్యూరిటీపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఆర్‌జీఎన్ఐడీ టెక్నికల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు సోషల్ మీడియా వినియోగించేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉదాహరణలతో వివరించారు. మాస్టర్‌ట్రైనర్ల సందేహాలను నివృత్తి చేశారు. మరో నిపుణుడు డేవిడ్‌పాల్ సంస్థ కార్యకలాపాలను గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మూడురోజుల పాటు సైబర్ సెక్యూరిటీపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అనిత, డా. ఎస్.పి.వి. రమణ, డా. కె. శ్రీనివాసరావు, డా. సునీత, డా. కె. లలిత, డా. రాజగోపాల్‌రెడ్డి, జిల్లాలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయి నుంచే లక్ష్యంపై గురిపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరణి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి స్థాయి నుంచే పిల్లలు తమ లక్ష్యంపై గురిపెట్టినప్పుడు అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకుంటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి సఫలతా కా రాస్తా పేర్కొన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి రాబోయే పదవ తరగతి పరీక్షల్లో చక్కటి ఫలితాలను సాధించడం ప్రధానమన్నారు. ఈ దశలో కష్టపడి చదివితే జీవితంలో అత్యుత్తమ స్థానాలకు ఎదగగలరన్నారు. ఇంకా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లాల ఏజీఎంలు రాజు, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, నజీర్, ఆర్ఐలు రామకృష్ణశర్మ, కిరణ్‌కుమార్, మల్లికార్జున, ఆర్‌ఎండీ హెడ్ నరేష్, కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్, ఏవోలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంగా వైఎస్ జగన్‌ను తిరిగి ఎన్నుకుందాం



ఆకేపాటితో భేటి అయిన డిప్యూటి సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో జనరంజక పాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కొనియాడారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని జెడ్పీ చైర్మన్ నివాసంలో ఆకేపాటి ఇచ్చిన తేనెటి విందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె.సురేష్‌బాబు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా జననేత సాగిస్తున్న పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రతి అర్హుడికి పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలియజేశారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనెడ్డిని తిరిగి ఎన్నుకుందామని పిలుపునిచ్చారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్ఓ చాంబర్‌లో ఫిబ్రవరి 13వ తేది వరకు నిర్వహించే కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా వివక్షతను ముగిద్దాం-గౌరవాన్ని స్వాగతిద్దాం అనే నినాదంతో చేపట్టే కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 13వ తేది వరకు స్పర్శ, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని ఆరోగ్య సిబ్బందిలో భాగమైన సీహెచ్‌ఓ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు కుష్టు వ్యాధి లక్షణాలుగల వారిని గుర్తించి సమీపంలోని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారితో చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, భారతి పాల్గొన్నారు.

వైవీయూలో అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు



పదోన్నతుల ప్రక్రియను చేపట్టిన వీసీ, ఇతర అధికారులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లుగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్ రఘునాథరెడ్డి, రాష్ట్ర గవర్నర్ నామిని, జాతీయ సంస్థలు, రాష్ట్ర రాష్ట్రీయేతర విశ్వవిద్యాలయాల సబ్జెక్టుల నిపుణులు, వైవియూలోని ఆయా సబ్జెక్టుల డీన్లు, అధిపతులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నామినీల సమక్షంలో ఇంటర్వ్యూ లు జరిగాయి. ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ సబ్జెక్టుల్లోని అసోసియేట్ ప్రొఫెసర్లు కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సి.ఎ.ఎస్) ద్వారా ప్రొఫెసర్లుగా పదోన్నతి కోసం హాజరయ్యారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డైరీ ఆవిష్కరణ



ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా ఖజానా శాఖ డీడీ వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 డైరీని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. సోమవారం స్థానిక జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీడీ మాట్లాడుతూ పెన్షనర్ల అవగాహన కోసం ప్రతి ఏడాది డైరీ రూపొందిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జంబారపు అహరోను, సబ్ ట్రెజరీ ఆఫీసర్లు జి. రవికుమార్, కేవీ అనిల్ కుమార్, జె. ప్రభుదాస్, అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.